ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.3 : కనిష్ఠం 25.2
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
మంగళవారం 10 సెప్టెంబరు 2024


కుప్పి ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

కోటి ఆశల.. కుప్పి!



- జిల్లాలో ఏళ్ల తరబడి ఊరిస్తూ.. వస్తున్న కుప్పి ప్రాజెక్టు నిర్మాణ పనులు
- మళ్లీ కునారిల్లుతున్న కుప్పి రిజర్వాయర్
- నిధులు మంజూరైనా.. అధికారుల సర్వేకు తప్పని ఆటంకాలు
- కొత్త ప్రభుత్వంలోనైనా పనులు పూర్తయ్యేనా?!
- మొదటి విడత కింద రూ.234 కోట్లు మంజూరు చేసిన సర్కారు
- ప్రాజెక్టు పూర్తయితే కడెంకు నిరంతర నీటి సరఫరాకు అవకాశం

ఇచ్చోడ, సెప్టెంబరు, 9: చుట్టూ ఎత్తైన సహ్యాద్రి పర్వత గుట్టల మధ్య సువిశాలమైన లోతట్టు ప్రదేశం.. నాలుగైదు మండలాల పరిధిలోని గుట్టల మధ్యలో నుంచి కడెం నది అత్యంత వేగంగా జాలువారే చోటు.. సాగు, తాగునీటితో పాటు విద్యుదుత్పత్తి, పర్యాటకానికి అనువైన ప్రాంతం ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని నేరడిగొండ మండలంలోని కుప్పి ప్రాంతం. ఇక్కడ బహుముఖ ప్రయోజనాలు ఉన్న ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతమంతా సుభిక్షంగా మారుతుందని సీఎం రేవంత్‌రెడ్డి సైతం కుప్పి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకొని మొదటి విడత కింద రూ.234 కోట్ల బడ్జెట్ మంజూరు చేయడం జరిగింది. కానీ, ప్రాజెక్టుకు సంబంధించి సర్వే పనులను రైతులు అడ్డుకోవడంతో ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకమని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనలు, వినతి పత్రాలను అందజేస్తున్నారు. ఏళ్ల తరబడి ఊరిస్తూ వస్తున్న ప్రాజెక్టు నిర్మాణానికి ఎట్టకేలకు నిధులు మంజూరైనా.. సర్వేకు అడ్డంకులు ఏర్పడుతున్న తరుణంలో మళ్లీ కూనరిల్లుతున్న కుప్పి రిజర్వాయర్‌పై ప్రత్యేక కథనం..

వినియోగంలోకి 5.32 టీఎంసీలు

ఇచ్చోడ, నేరడిగొండ మండలాల పరిధిలో రెండు కొండల మధ్య నుంచి కడెం నదీ ప్రవహిస్తుంటుంది. ఈ కొండలను కలుపుతూ ఆనకట్ట నిర్మిస్తే సుమారు 5.32 టీఎంసీల నీటిని వినియోగంలోకి తేవచ్చని గతంలోనే ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రభుత్వం అంచనా వేసింది. అయితే, ఇందులో భాగంగా భూ నిర్వాసిత గ్రామాలు చాలానే ఉంటాయంటున్నారు. కుప్పి జలాశయం నిర్మాణంలో గాజిలి, గాంధారి, కుమారి, కుప్పి పరిధిలోని దాదాపు 2015 సర్వేలో భాగంగా 1,037 కుటుంబాలు నిర్వాసితులు కానున్నారు. నిర్వాసితుల సంఖ్య 3,024 మంది ఉంటుందని గతంలో అంచనా వేశారు. గ్రామాల్లో దాదాపు మొత్తంగా 2500.88 ఎకరాల భూమి ముంపు పరిధిలోకి రానుందని సర్వేలో పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్వాసితుల సంఖ్య పెరిగి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.


ప్రాజెక్టు నిర్మాణ విషయమై తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కుమారి గ్రామస్థులు (ఫైల్)

వేల ఎకరాలు సస్యశ్యామలం

కడెం జలాశయం కింద ప్రస్తుతం 68,500 ఎకరాల చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించేందుకు కుప్పి ప్రాజెక్టు తోడ్పడనుంది. ఇక్కడ 3 మెగావాట్ల విద్యుదుత్పత్తి, కడెంకు నిరంతరం నీళ్లందిస్తూనే ఏడాది పాటు 5.32 టీఎంసీల నీరు నిలువ సామర్థ్యం గల డ్యాం నిర్మించనున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. కుప్పి నుంచి అత్యంత వేగంగా వరద ప్రవాహం ఉండడంతో గడిచిన 30 ఏళ్లలో కడెం ప్రాజెక్టు నంచి 1,400 టీఎంసీల నీళ్లు వృథాగా గోదావరి ద్వారా సముద్రంలో కలిశాయి. ఇపుడు కుప్పి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే.. నీరు భారీగా నిలిచి ఉంటుంది. వర్షాభావ పరిస్థితలలో అల్లాడుతున్న బోథ్ ఏరియా అంతా ఈ ప్రాజెక్టు ద్వారా సస్యశ్యామలం కానుంది. కుంటాల జలపాతానికి నిరంతరం నీటితో.. యేడాది పొడవునా అది కళకళలాడుతూ పర్యాటకులను ఆకర్షిస్తుంది. అలా చేస్తే రాష్ట్రంలోనే అతి ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది. అత్యధిక వర్షపాతం ఉన్నా కరవు మండలాలైన ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, బజార్‌హత్నూర్ మండలాలకు భవిష్యత్తులో ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) ఏర్పరిచి సాగునీరు అందించవచ్చు. భూగర్భ జలాలు సమృద్ధిగా పెరుగుతాయి. అంతేకాకుండా చేపల వృత్తి, పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. పైగా ఇది అద్భుతమైన వాటర్ గ్రీడ్‌గా పని చేసి దిగవనున్న గ్రామాలకు తాగునీరు అందించవచ్చు.

నిర్మాణానికి గ్రామస్థులు వ్యతిరేకం

ప్రభుత్వం చేపడుతున్న కుప్పి ప్రాజెక్ట్‌లో కుప్పి, కుమారి గ్రామాల ఇళ్లు, పంట పొలాలల్లో ఏడాదికి రెండు పంటలు కోల్పోతున్నామంటున్నారు. ప్రాజెక్టు కట్టడం వల్ల తాము జీవనోపాధిని కోల్పోతున్నామని, దీంతో కుప్పి ప్రాజెక్టుకు వ్యతిరేకమని స్థానిక తహసీల్దార్‌కు ఇటీవల గ్రామస్థులు వినతి పత్రాన్ని అందజేశారు. అయితే గత 20 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రాజెక్టులు పూర్తి అయినప్పటికీ ఇప్పటి వరకు భూ నిర్వసితులకు న్యాయం జరగలేదని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

కుప్పి స్థలం పరిశీలన

కడెం పరివాహక ప్రాంతమైన కుప్పి ప్రాంతం వద్ద నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టు స్థలాన్ని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు గతంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరలో కలెక్టర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించనుండడంతో అధికారులు ముందస్తుగా సమగ్రంగా పరిశీలించారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో కుప్పి ప్రాజెక్టు కోసం బడ్జేట్‌లో రూ.234 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ఈ స్థల పరిశీలన చేస్తున్నరన్న సమాచారం తెలుసుకున్న కుమారి, గాజిలి, గాంధారి, కుప్పి గ్రామస్థులు అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందే ముంపునకు గురవుతున్న గృహ సముదాయాలు, వేల ఎకరాల భూమి ముంపునకు గురవుతుందని, అన్ని సమస్యలు పరిగణలోనికి తీసుకున్న తర్వాతే ముందుకు సాగాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే స్థల పరిశీలన చేస్తున్నామని గ్రామస్థులతో అధికారులు వివరించారు.

భూ నిర్వాసిత రైతులు సర్వేకు సహకరించాలి

: భీంరావు, ఇరిగేషన్ డీఈ, ఆదిలాబాద్

కుప్పి ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి భూ నిర్వాసిత రైతులు రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ అధికారులకు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతేకాకుండా ఇది 5.32 టీఎంసీల నిలువ సామర్థ్యం గల జలశయం. దీనిని రూ.1324 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు, 3 మెగావాట్ల విద్యుదుత్పత్తికి సంబంధించిన అంచనాలు, నిర్వాసిత గ్రామాలు, అలాగే భూముల వివరాలు రూపొందించి పంపడం జరుగుతుంది.

సంక్షిప్త సమాచారం


అర్జీదారుల సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : అదనపు కలెక్టర్

ఆదిలాబాద్, సెప్టెంబరు 9: ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా దరఖాస్తులను పరిశీలిస్తూ సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరి ంచాలని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఇందులో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీవో వినోద్‌కుమార్, జిల్లా అధికారులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు ప్రజావాణి

ఆదిలాబాద్, సెప్టెంబరు 9: ప్రభుత్వం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు ప్రతీ మంగళ, శుక్రవారాల్లో మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్ బేగంపేట హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహిస్తుందని కలెక్టర్ రాజర్షిషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో మహాత్మాజ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించే సమావేశాల కారణంగా ఈ నెల 10న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం 11వ తేదీకి వాయిదా పడిందన్నారు. ఈ సందర్భంగా అర్జీదారులందరు ఈ మార్పును గమనించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం : ప్రిన్సిపాల్

ఉట్నూర్, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని గిరిజన పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ప్రవేశం కోసం అర్హులైన గిరిజన విద్యార్థులు ఈ నెల 11 వరకు దరఖాస్తులు చేసుకోవాలని, 11 నుంచి 20 వరకు వాక్ ఇన్ అడ్మిషన్స్ ఉంటాయని ఐటీఐ ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వాక్యుమ్ అడ్మిషన్ల కోంస ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఫస్ట్‌పేస్, సెకండ్‌ఫేస్, థర్డ్‌పేస్‌లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు వాక్‌ఇన్ అడ్మిషన్‌కు అర్హులు కారన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో ఆప్లై చేయవల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు పదవ తరగతి, 8వ తరగతి ఉత్తీర్ణులై 14ఏళ్ల వయసు నిండిన వారై ఉండాలన్నారు. అంతేకాకుండా అదనపు వివరాల కోసం ఫోన్ నెం.9491460060 ద్వారా సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బోథ్, సెప్టెంబరు 9: మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబా లను ఎంపీ నగేష్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఎంపీ వెంట మాజీ ఎంపీపీ కిషన్, బీజేపీ మండల కన్వీనర్ బి.రవీందర్, మాజీ సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, వెంకటేశం, రమేష్, తదితరులున్నారు.

తెలంగాణ యాసను పరిచయం చేసిన కాళోజీ

- జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి
- జిల్లావ్యాప్తంగా ఘనంగా కాళోజీ జయంతి
- నివాళ్లు అర్పించిన అధికారులు, నాయకులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 9: తెలంగాణ యాసను పరిచయం చేసిన మహాకవి కాళోజీ నారాయణ అని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కాళోజీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ యాసను కించపరిచిన వారికి తనకవిత్వాల ద్వారా సమాధానం చెప్పిన మహానీయుడు కాళోజి అని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ ఏర్పాటులో ఆయన కృషిఉందని కొనియాడారు. నిజాం సర్కార్‌తో పోరాడి ఉనికి చాటారన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా ప్రతీఒక్కరు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇందులో శిక్షణ సహాయ కలెక్టర్ అబిగ్యాన్ మాలవీయ, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, డీడబ్ల్యువో సబితా, అధికారులు పాల్గొన్నారు.


కాళోజి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

భాషా అభ్యున్నతికి కాళోజి కృషి : ఎస్పీ

ఆదిలాబాద్: పోలీసు ముఖ్య కార్యాలయంలో కాళోజి నారాయణ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం పోలీసు ముఖ్య కార్యాలయంలో కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కాళోజి నారాయణ రావు భాషా అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన వ్యక్తి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి గౌరవించిందన్నారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీ పోతారాం శ్రీనివాస్, పోలీసు కార్యాలయం ఏఓ భక్త ప్రహ్లాద, సీసీ దుర్గం శ్రీనివాస్, అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటి, సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, సిబ్బంది పోతరాజు, రమణ, పద్మ, ప్రసాద్, సత్యనారాయణ, ఆశన్న, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో తెలంగాణ భాషా దినోత్సవం, కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత మాట్లాడుతూ తెలంగాణ భాష పలుకుబడుల భాష అని తెలిపారు. మన భాషలో తెలంగాణ ఆత్మ ఉంటుందని పేర్కొన్నారు. మన భాషను మనమే గౌరవించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు రడాపు సంతోష్ కుమార్, అధ్యాపకులు అరుణ్‌కుమార్, డీఎస్ చక్రవర్తి, రమాకాంత్ గౌడ్, రవి కిరణ్, శ్రావణి, మంజుల, ఆనందం, రాజ్ కుమార్, నర్సింగరావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: తెలంగాణ భాషను పట్టం కట్టాలని నినాదించిన ప్రజాకవి కాళోజి నారాయణరావ్ జయంతి ఉత్సవాలను సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎంఎ కలీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల్లో చైతన్య దీప్తిని వెలిగించారని జీవితాంతం వారి గొంతుకగా బతికిన కాళోజి చిరస్మరణీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహేష్, ఎంఆర్ఐ నాగోరావు, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి,ఎంసీ శంకర్, ఎంపీడీవో రాజ్‌వీర్, సీనియర్ అసిస్టెంట్ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: తెలుగు భాష కోవిదుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో మేఘమాల, హెచ్‌ఎం వెంకట్రావ్, సిబ్బంది నగేష్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలలో సోమవారం తెలంగాణ ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన తెలంగాణ ఏర్పాటు కోసం చేసిన కృషిని ప్రిన్సిపాల్ శైలజ వివరించారు. ఇందులో పాఠశాల డైరెక్టర్ బద్దం పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సోనాల మండల కేంద్రంలో ఫూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గాజుల పోతన్న, ప్రధాన కార్యదర్శి భక్తుల రమేష్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బలిరామ్, సత్యనారాయణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్పీ


నేరడిగొండలో నివాళ్లర్పిస్తున్న తహసీల్దార్, అధికారులు


..తలమడుగులో ఎంపీడీవో, అధికారులు


ఉట్నూర్‌లో కాళోజి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీవో

అర్జీల పరిష్కారానికి చర్యలు : పీవో

- కాళోజీకి ఘన నివాళ్లు అర్పించిన ఐటీడీఏ అధికారులు

ఉట్నూర్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. దీనిలో భాగంగా పింఛన్లు, రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా ఐటీడీఏ సమావేశ మందిరంలో కార్యాలయం సిబ్బందితో కలిసి కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ గిరిజన దర్బార్‌లో ఎస్‌డీసీ గంగాధర్, ఏవో దామోదర్ పీహెచ్‌వో సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషనం, పేసా కోఆర్డినేటర్ వసంతరావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తా

- నూతన సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్


బాధ్యతలను స్వీకరిస్తున్న మర్మాట్

ఉట్నూర్, సెప్టెంబరు 9: ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నిరంగాల అభివృద్ధికి కృషి చేస్తానని ఉట్నూర్ సబ్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాటాడుతూ 2022వ బ్యాచ్‌కు చెందిన తాను.. రాజస్థాన్ నుంచి వచ్చానని తెలిపారు. తండ్రి ఆసామీన్ ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని, తల్లి కమలాదేవి గృహిణి అన్నారు. మొదటిసారిగా ఉట్నూర్ నుంచి తన బాధ్యతలు ప్రారంభమవుతున్నందున జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రభుత్వ కార్యక్రమాలుచేపట్టడం జరుగుతుందన్నారు. తాను ఐఐటీలో సివిల్ ఇంజనీర్‌గా చేశానని, ఈ ప్రాంతంలోని రోడ్ల సమస్యలపై దృష్టి పెడతానన్నారు. అదే విధగా గ్రామీణ ప్రాంతాలలో విద్య, వైద్యంపై ప్రత్యేకదృష్టి పెడతానన్నారు. రెవెన్యూ డివిజన్‌లోని అన్ని సమస్యలను అధ్యయనం చేసుకొని పరిష్కరించడానికి ప్రయత్నాలు చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఉట్నూర్ తహసీల్దార్ బి.ప్రవీణ్‌కుమార్, ఇంద్రవెల్లి తహసీల్దార్ ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలుసుకొని స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం పరిపాలన అధికారి జాదవ్‌భీమ్‌రావు, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తలమడుగు, సెప్టెంబరు 9: టీఎస్ ఆర్టీసీ అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగపరుచుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ మెరుగైన ప్రయాణం కోసం ప్రతిఒక్కరూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలన్నారు. అదేవిధంగా ప్రయాణికులు ఆర్టీసీ అందిస్తున్న సేవలు దివ్యాంగులకు పీహెచ్‌సీ పాసులు, బస్ పాస్‌లు, వివాహ శుభకార్యాలకు రాయితీపై బస్‌ల బుకింగ్ గురించి, అలాగే గమ్యం యాప్‌ల గురించి వివరించారు. ఇందులో వీబీవోలు ఎం.శ్రీనివాస్, పి.మధు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేయాలి

నార్నూర్, సెప్టెంబరు 9: మధ్యాహ్న భోజన బిల్లులను విడుదల చేసి, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రంలో ఏఐటీయూసీ సభ్యుడు ఝాడే నాందేవ్ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నార్నూర్ డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్‌కి వినతిపత్రం అందేశారు. గత కొనేళ్ల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ బడి పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో కీలకపాత్ర వహిస్తున్నా.. కనీస వేతనాలు ఇవ్వడం లేదని వారు పేర్కొన్నారు. ఇందులో మండల అధ్యక్షురాలు తాయిచంద్‌బి రేణుకాబాయి, మైనుశివబాయి, సులోచన, కుమ్రలక్ష్మి, సక్రవంతిబాయి, తదితరులున్నారు.

కాంగ్రెస్ పేదోళ్ల పార్టీ

● నియోజక వర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, సెప్టెంబరు 9: కాంగ్రెస్ పేదోళ్ల పార్టీ అని, అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని ఆ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రజాసేవ భవన్‌లో ఆయన సమక్షంలో కుంభజరి, శివఘాట్, మత్తడిగూడ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా కందిశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కడ పేదేళ్లు ఉంటారో అక్కడ కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నారు. పేదలకు రేషన్‌కార్డు, ఇండ్లు, ఆరోగ్యశ్రీకార్డులు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో నాయకులు లోక ప్రవీన్‌రెడ్డి, బండారి సతీష్, సంజయ్,పోతారెడ్డి, కిషన్, ఎంఎ షకీల్, ఆశన్న,రఫీక్, బండారి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

బోథ్, సెప్టెంబరు9: బోథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలువురు వ్యక్తులు పొగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. గతంలో తమ ఫోన్లు పోయినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వాటిని రికవరీచేశారు. సుధాకర్ గత నాలుగు రోజుల క్రితం సెల్‌ఫోన్ పొగొట్టుకోగా పోలీసులు రికవరీ చేసి అప్పగించారు. అంతకుముందు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంకటేష్ అనే వ్యాపారికి ఫోన్‌ను రికవరీ చేసి అప్పజెప్పినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

భూమి కేటాయింపు సమస్య పరిష్కారం

నార్నూర్, సెప్టెంబరు9: గత 25ఏళ్ల క్రితం నార్నూర్ మండల కేంద్రం అన్నబావుసాటే కమిటీ హాల్‌లోకి కేటాయించిన భూమి సమస్యని మాజీ సర్పంచ్ భానోత్ గజానంద్‌నాయక్ పరిష్కారం చేశారు. గ్రామానికి చెందిన ఆదివాసులు మడావి మానుకు మడావి ఆనందరావును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్‌మోరే,మండల అధ్యక్షుడు కోరల మహేందర్, దిగంబర్, సునిల్, రాజు తదితరులున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

జైనథ్ రూరల్, సెప్టెంబరు9: జైనథ్ గ్రామానికి చెందిన అల్లకొండ చిన్న భూమన్న (62) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గత ఐదేళ్లుగా అస్తమాతో బాధపడుతున్న చిన్న భూమన్న వ్యాధి తీవ్రత ఎక్కువై జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉదయం తన ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు జైనథ్ గ్రామస్థులు చికిత్స నిమిత్తం 108ద్వారా జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు జైనథ్ పోలీసులు శవపంచనామ నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రంలో రిమ్స్ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఆదివాసీలపై కేసులు పెట్టడం సరికాదు'

ఉట్నూర్, సెప్టెంబరు 9: జైనూర్ ఘటనలో ఆదివాసీ గిరిజనులపై పోలీసులు కేసులు పెట్టడం సరైంది కాదని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతంబాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు, భారత్ మహాసభ జిల్లా అధ్యక్షురాలు పెందూరు ప్రియాంకలు అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జైనూరు సంఘటన బాధాకరమని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో బ్రతకడానికి వచ్చిన వారు ఏ జెన్సీలోని గిరిజన మహిళల పై అఘాయిత్యాలకు పాల్పడుతు అత్యాచారాలకు పాలు పడుతున్నారని ఆరోపించారు. ఏజెన్సీ చట్టాలు అమలు చేయక పోవడం వల్లనే బయటివారు ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి అమాయక గిరిజనులపై దాడులు చేస్తున్నారని అన్నారు. ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం చేసి దాడి చేసిన మహబూబ్‌ని ఉరితీయాలి అన్నారు. నిందితులకు ఇలాంటి శిక్షలు పడితేనే ఇలాంటి సంఘటను పునరావృతంకావని అన్నారు. ఆదివాసుల పై దాడులు చేస్తున్న వారి పై ప్రతి దాడులు చేస్తే కేసులు పెడతారి అని ప్రశ్నించారు. జైనూర్ ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించకుంటే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఏజెన్సీ ప్రాంతంలో ఒకవర్గం వారు ఆదివాసీ మహిళలను లొంగదీసుకుని వందలాది మందిని పెళ్లిళ్లు చేసుకున్నారని అన్నారు. ఈ విషయం ఇటీవల పర్యటించిన అడిషనల్ డీజీ మహేశ్‌భగవంత్‌కు వివరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే కొమురంభీం తరహాలో మరో పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో అరక ఉమేష్, చాకటి సూర్యరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'జైనూర్ ఘటన నిందితుడిని ఉరి తీయాలి'



నిరసన తెలుపుతున్న ఆదివాసీలు



మాట్లాడుతున్న ఆదివాసీ మహిళ సంఘం నాయకులు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు9: కొమురంభీం జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నం చేసిన నిందితుడిని ఉరితీయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కనక తుకారం ఆందోళన చేపట్టారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జైనూర్ ఏజెన్సీలో ఆదివాసీలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివాసీల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సీడాం భీంరావు, ఆర్కా ఖమ్ము, మెస్రం జైరామ్, కోవా రాజేశ్వర్, కనక హనుమంత రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్: ఆదివాసీ మహిళపై అత్యాచారం హత్యాయత్నానికి పాల్పడిన మూర్ఖుడు ఎస్‌కే ముగ్ధూమ్‌ను వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి 15 నుంచి 20 రోజుల్లో ఉరి వేయాలని ఆదివాసీ మహిళ సంఘం డిమాండ్ చేసింది. ఆదివాసీలపై ఎదురుదాడి చేసిన మైనార్టీ ముస్లింలపై ఎస్సీఎస్టీ అట్రాసిటీయాక్ట్ కేసులు నమోదు చేయాలన్నారు.

ఉరిశిక్ష వేయాలి

ఉట్నూర్: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడిపై పాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి మృగాడికి ఉరిశిక్ష పడేంత వరకు ఉద్యమిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు ప్రకటించారు. సోమవారం ఉట్నూర్ మండలకేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తుడుందెబ్బ ఉట్నూర్ పార్టీ మండల అధ్యక్షుడు పెందూర్ త్రిమూర్తి మాట్లాడుతూ జైనూర్ మండల కేంద్రంలో 1970లో వలస వచ్చిన మైనార్టీల భూయజమాన్య హక్కుపత్రాలు, ఆధార్, రేషన్, కరెంట్ బిల్లులు, వాణిజ్య వర్తక, వ్యాపార అనుమతులను రద్దుచేసి ఏజెన్సీ నుంచి ప్రభుత్వమే తరలించాలని, అలాగే జైనూర్ ఘటనలో ఆదివాసీలపై ఎదురుదాడికి పాల్పడిన మైనార్టీలపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులునమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం జరుపకపోతే తమ చట్టాలను, పంచాయతీ రాజ్ విస్తీర్ణ చట్టం (పేసా)ను అమలుపరిచి మావా నాటే మావరాజ్‌ను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు టేకం హరి ప్రసాద్, పెందూరు మోతిరాం, జనార్ధన్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

ఉరిశిక్ష వేయాల్సిందే..

నార్నూర్: గత కొన్నిరోజుల క్రితం కుంరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి ఉరిశిక్ష వేయాల్సిందేనని ఆదివాసీ సమాజ పెద్దలు గాదిగూడ మండలం లోకారిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జైనూర్‌లో 1970 తర్వాత వలస వచ్చిన ముస్లిం మైనార్టీల ప్రజల భూయజమాన్య హక్కు పత్రాలు ఆధార్‌రేషన్, కరెంట్ వ్యాపార అనుమతులు రద్దుచేసి ఏజెన్సీ నుంచి ప్రభుత్వమే తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూసంబాధిరావు, మేస్రం దేవరావు, మాజీ సర్పంచ్ లోకారి, మండాడి దౌలత్‌రావు, సారమేడి, గితేదారి కొడప జాకు సిడాంనాగోరావు, నటరాజ్ సిడాం నాగోరావు, భారత్ దేవరావు పాల్గొన్నారు.

ప్రజల్లో శాంతి, సామరస్యమే ఏకైక లక్ష్యం..

నార్నూర్: మండలకేంద్రం గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతరకులాల ప్రజల్లో శాంతి, సామరస్యమే ఏకైక లక్ష్యం కలిసి మెలిసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని, ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సహకరించాలని మాజీ సర్పంచ్ భానోత్ గజానంద్‌నాయక్ అన్నారు. జైనూర్ మండలం ఆదివాసీ మహిళపై జరిగిన ఘటన దృష్ట్యా ముందస్తుచర్యలు భాగంగా అన్నికులాల సమాజ పెద్దలతో స్వగృహం దగ్గర ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి చర్చలు జరిపారు. ఎవరూ సోషల్‌మీడియా వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్ ఇతర అంశాల ద్వారా ఇబ్బందికర పోస్టులు చేయవద్దని సూచించారు. గ్రామంలో కుల, మత వివాదాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఉత్తంరాథోడ్, జేఏసీ మాజీ చైర్మన్ ఓబీసీ గ్యానోబా పుష్కర్ దేవరావు, లోకండే కాంతారావు, దుర్గే నర్సింగ్‌మోరే, షేక్‌హుస్సేన్, అర్కాగోవింద, జకీరుల్లాఖాన్, సికేందర్, రాథోడ్, హసేన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని సీఎంకు వినతి

ఆదిలాబాద్, సెప్టెంబరు 9: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల వేలాది ఎకరాలు నీట మునిగి అపార నష్టం వాటిల్లిందని వరద ముంపు రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిసి జిల్లా రైతుల సమస్యలపై వినతిపత్రం అందించారు. ముఖ్యంగా పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలో వరదలు పోటెత్తి పత్తి, సోయాబీన్, కంది పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్ట పోయారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పంట పెట్టుబడి సైతం చేతికి రానిపరిస్థితి నెలకొందన్నారు. జిల్లాలో వరదల నష్టంపై వెంటనే అంచనా వేసి రైతులకు నష్ట పరిహారం అందించాలని, ఫసల్ బీమా యోజన పథకాన్ని పకడ్బందీగా అమలు పరచాలని కోరారు. దీంతో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పాయల తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్, సెప్టెంబరు 9: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్-11 బాల బాలికల చెస్ పోటీల్లో గెలుపొందిన విజేతలను ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎన్.స్వామి వెల్లడించారు. బాలికల విభాగంలో ఎస్‌ఆర్ హైస్కూల్ విద్యార్థి అంబటి సుకీర్తి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో శన్విత, అక్షర వీణ నిలిచారు. బాలుర విభాగంలో ఫస్ట్ ప్లేస్‌లో డి.రుద్ర కేదార్ నిల్వగా.. రెండు, మూడు స్థానాల్లో ఎస్.శ్రీజన్, ఆయన్ విజేతలుగా నిలిచారు. ప్రతీ జిల్లా నుంచి నలుగురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసిన పంపాలనే ఆదేశాలతో మొదటి మూడు స్థానాల్లో ఉన్నవారితో పాటు నాలుగో స్థానంలో ఉన్న వారిని సైతం రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దానికి సంబంధించిన జాబితను విడుదల చేసినట్లు తెలిపారు. ఎంపికైనవారు ఈనెల 14నుంచి తెలంగాణ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే పోటీలో పాల్గొంటారని తెలిపారు.

11న విద్యుత్ వినియోగదారుల వేదిక

బోథ్, సెప్టెంబరు 9: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గాను ఈనెల 11న బోథ్ సబ్ స్టేషన్ వద్ద పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ఏఈ వెంకటేష్ తెలిపారు. ఇచ్చోడ డివిజన్ పరిధిలోని బోథ్, నేరడిగొండ, బజార్హత్నూర్, ఇచ్చోడ మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఏజెన్సీ ప్రాంతంగా గుర్తించండి'

భీంపూర్, సెప్టెంబరు 9: భీంపూర్, తాంసి మండలాల్లోని కొన్ని గ్రామాలు వంద శాతం గిరిజన గ్రామాలు ఉన్నాయని, గోండ్వానా పంచాయతీ రాయి సెంటర్ హందర్ బంద్ ఆధ్వర్యంలో భీంపూర్ తహసీల్దార్ సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. వారిలో సార్మేడి మెస్రం హనుమంతు, ఉప సార్మేడి మర్సకొల మనోహర్, గితేదార్ కోరంగా విజయ్, గిరిజన నాయకులు వినోద్, అన్ను పటేల్, తదితరులు ఉన్నారు.

రాజ్‌గోండు జిల్లా మేడిగా గంగాధర్

ఉట్నూర్, సెప్టెంబరు 9: జిల్లా రాజ్‌గోండు సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా (జిల్లా మేడి) ఉట్నూర్ మండలం బీర్సాయిపేటకు చెందిన సిడాం గంగాధర్‌ను ఎన్నుకోవడం జరిగిందని రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెందూరు ప్రభాకర్, మంగం విష్ణురావులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కలిసి తెలిపారు. పదేళ్ల పాటు జిల్లా మేడిగా పని చేసిన మేస్రం దుర్గుపటేల్ అనుభవాల దృశ్య ఆయనను ఉపాధ్యక్ష పదవికి ఎన్నుకోవడం జరిగిందని వివరించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని గుస్సాడి గుట్టలో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించవద్దు

తలమడుగు, సెప్టెంబరు 9: పారిశుధ్య నిర్మూలనలపై నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. సోమవారం మండలంలోని దేవాపూర్‌లో చేపడుతున్న పారిశుధ్య నిర్మూలన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం పెరగడం వల్ల అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని అన్నారు. ఇందులో కార్యదర్శి విజయ్‌కుమార్, ఈజీఎస్ పీవో మేఘమాల, తదితరులున్నారు.

ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ● టీఎన్జీవోస్ భవనంలో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం

ఆదిలాబాద్, సెప్టెంబరు 9: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడంతో పాటు సంస్కృతిని చాటేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ గౌస్‌ఆలం సూచించారు. సోమవారం టీఎన్జీవోస్ భవనంలో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందని, దానిని ప్రతి ఒక్కరు కృతనిశ్చయంతో కొనసాగించాలని తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, 11 సెక్టార్లుగా విభజించి ప్రతీ సెక్టార్‌కి ఎస్సై స్థాయి అధికారిని నియమించడం జరిగిందని పేర్కొన్నారు. పట్టణంలో నాలుగు క్లస్టర్లను ఏర్పాటు చేసి ప్రతి క్లస్టర్‌కి సీఐ స్థాయి అధికారిని నియమించి, డీఎస్పీలు, అదనపు ఎస్పీ, ఎస్పీల ప్రత్యేక పర్యవేక్షణతో ప్రతి రోజు గస్తీని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదనంగా 12 ఫుట్ పెట్రోలింగ్ పార్టీలను నియమించి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. పట్టణంలో ప్రత్యేకంగా ముఖ్యమైన ప్రదేశాలలో పికెట్లను ఏర్పాటు చేశామని, ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలపారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి


మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి



అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడం జరుగు తుందని సూచించారు. అత్యవసరమైన సమయాలలో స్పందించేందుకు ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సమాచారం అందించే వారు ఫోన్ నెం.8712659906 ద్వారా తెలపాలన్నారు. డీజేలకు అనుమతి లేదని తెలిపారు. ఇందులో అదనపు ఎస్పీ ఆపరేషన్స్ బి.సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, పట్టన సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్, ఫణిదర్, ప్రణయ్‌కుమార్, శ్రీనివాస్, ఎస్సైలు ముజాహిద్, విష్ణువర్ధన్, హిందు ఉత్సవ సమితి సభ్యులు బొంపల్లి హణుమండ్లు, సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు ప్రమోద్‌కుమార్‌కత్రి, పెద్దలు కమల్‌కిషోర్ అగర్వాల్, గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబ సభ్యులకు అండగా..

ఆదిలాబాద్: బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా అండుబాటులో ఉంటుందని ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. లింగాపూర్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై నైతం నారాయణ జూలై 11న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా 1989 పోలీసు బ్యాచ్‌కు చెందిన పోలీసులు రూ.50 వేలను ఎస్పీ ఆలం చేతులమీదుగా భార్య సుశీల,కొడుకు ప్రవీణ్‌లకు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు యంత్రాంగం ఎల్లవేళాల అందుబాటులో ఉంటుందని, ఎలాంటి సహాయ సహకారమైనా అందజేయడం జరు గుతుందని అన్నారు. ఇందులో కోర్టు లైజన్ అధికారులు సయ్యద్ తాజుద్దీన్, ఈశ్వర్‌సింగ్, రాఘవేంద్ర, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ఏఎస్సై సుభాష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, పాల్గొన్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు

● నిమజ్జనం చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

ఆదిలాబాద్: వాగులు, చెరువుల వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ జీవన్ రెడ్డి సూచించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని చందా వాగు వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వలంటీర్లకు పలు సూచనలు చేశారు. వాగు ప్రవాహం బట్టి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట సీఐలు ఫణిదర్, కర్ణాకర్ రావ్, సునీల్ కుమార్, ఎస్సైలు ముజాహిద్, విష్ణువర్ధన్, తదితరులు ఉన్నారు.

నాగోబా పురాతన ఆలయాన్ని ప్రారంభిస్తాం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 9: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా (మురాడి) పురాతన ఆలయాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా(మురాడి) ఆలయ పనులను పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నాగోబా మురాడి ఆలయ నిర్మాణానికి వారి సొంత నిధులను ఖర్చు చేస్తున్నారని, దాదాపు అన్ని పనులు పూర్తి అయ్యాయని త్వరలో సంప్రదాయ బద్ధంగా ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాగోబా ఆలయ అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, సోమోరే నాగోరావు, రాథోడ్ పరశురాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేను కలిసిన కుల సంఘాల నాయకులు

ఉట్నూర్: ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సమీకృత గురుకుల విద్యా సంస్థను ఏర్పాటు చేయించాలని వివిధ కుల సంఘాల నాయకులు సోమవారం మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన సమీకృత ఆదర్శ గురుకులాలనుమన నియోజక వర్గానికి ఒకటి వెంటనే మంజూరు చేయించాలని వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సామ ప్రభాకర్ రెడ్డి, మర్సకోల తిరుపతి, దాసండ్ల ప్రభాకర్‌లు మాట్లాడుతూ గురుకులాల మంజూరు కోసం ప్రత్యేకశ్రద్ధ చూపించాలని ఎమ్మెల్యేని కోరారు. మన ప్రాంతంలో ఈ పాఠశాల స్థాపన ద్వారా రాబోవు తరాల పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని తద్వారా తమరి మేలు చిరస్థాయిగా నిలుస్తుందంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో గొడిసెల్లి నర్సయ్య, సీపతి లింగాగౌడ్, కొండెరి రాజేశ్వర్‌లు కోరగా ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మాట్లాడుతూ ఈ ఆదర్శ గురుకులాలను మంజూరు చేసి నిర్మాణం తనకు ఆనందమేనని, భూమి సమీకరణకై పీఓ, ఆర్డీఓలకు లేఖ ద్వారా సంప్రదించామన్నారు. వీరి వెంట తొగరి రఘు, తొటు ఆశన్న, కొత్తపెల్లి మహేందర్, మారపాక రాజన్న, అల్లూనూరి రమేష్, బింగి ఈశ్వర్, గొల్లపెల్లి శ్రీనివాస్, గర్మకుర్తి వెంకటేశ్, తదితరులు ఉన్నారు.


నాగోబా మురాడి ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పెట్రోల్ అమ్మకాలపై పోలీసుల ఆంక్షలు

● ఇబ్బందులు పడుతున్న రైతులు

బోథ్, సెప్టెంబరు 9: ఆదిలాబాద్ జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యగా ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని వాహనాలలో కాకుండా ప్లాస్టిక్ బాటిల్‌లో డబ్బాలలో పెట్రోల్ డీజీల్ విక్రయం నిలిపివేయాలని బంక్ యజమానులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో డివిజన్ పరిధిలోని అన్ని బంకుల్లో పెట్రోల్, డీజీల్ విక్రయాలు నిలిపివేశారు. అయితే రైతులు తమతమ చేలలో పురుగు మందును పిచికారి చేసేందుకు గాను తైవాన్ స్ప్రేల ద్వారా మందులను పిచికారి చేయాలంటే పెట్రోల్ అవసరం ఉందని బంక్‌లకు వెళితే బంక్‌ల యజమానులు అమ్మడానికి నిరాకరిస్తున్నారు. విషయం తెలియని రైతులు బంక్‌ల యజమాన్యాలతో వాగ్వావాదానికి దిగుతున్నారు. పోలీసు అధికారులు రైతుల సమస్యలు దృష్టిలో ఉంచుకుని బాటిళ్లలో పెట్రోల్ విక్రయించడానికి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పిప్పల్‌కోటిలో 'మహా' పోలీసుల విచారణ

భీంపూర్, సెప్టెంబరు 9: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన జనకొండ నారాయణ అనే వ్యక్తి మృత దేహం మహారాష్ట్ర పిప్పల్‌గావ్ అటవీ ప్రాంతంలో ఆదివారం మాండ్వీ పోలీసులు గుర్తించారు. పూర్తిగా కాలిపోయిన స్థితిలో ఉన్న మృత దేహానికి పోస్టుమార్టం అనంతరం అక్కడి పోలీసులు ఇది హత్యగానే నిర్ధారించినట్లు తెలిసింది. ఈ మేరకు మహారాష్ట్ర కిన్వట్, మాండ్వీ ప్రాంత పోలీసులు సోమవారం పిప్పల్‌కోటి గ్రామానికి విచ్చ కొద్ది గంటల పాటు లోతుగా విచారణ చేపట్టారు. మహారాష్ట్ర కిన్వట్ డీఎస్పీ, సీఐ మాండ్వీ ఎస్ఐ, క్రైమ్ బ్రాంచ్ పోలీసులు గ్రామంలో అన్ని కోణాల్లో విచారణ చేశారు. తరువాత పోలీసుల విచారణ కోసం మృతుడి భార్య విజయలక్ష్మీ సహా మరో ఇద్దరు బంధువులను అదుపులోకి తీసుకుని అక్కడి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కాగా ఈ ఉదంతం స్థానికంగా చర్చనీయాంశంగా అయింది.

విద్యార్థికి పాము కాటు

నోటితో విషం లాగేసిన ఉపాధ్యాయుడు

భీంపూర్, సెప్టెంబరు 9: విద్యార్థిని పాము కాటు వేసిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివారాలల్లోకి వెళ్తే.. మండలంలోని ధన్నూర్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న యశ్వంత్ అనే విద్యార్థి మధ్యాహ్న భోజన సమయంలో వరండాలోకి వచ్చాడు. అదే సమయంలో టైల్స్ కింద నుంచి వచ్చిన పాము యశ్వంత్‌కాలుకు కాటు వేసింది. గమనించిన ఉపాధ్యాయుడు సురేష్ విద్యార్థి కాలుకు కట్టు కట్టి విషాన్ని నోటితో లాగేసాడు. వెంటనే భీంపూర్ పీహెచ్‌సీకి విద్యార్థిని తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రస్తుతం విద్యార్థికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. కాగా, తన ప్రాణాలను లెక్క చేయకుండా విద్యార్థి ప్రాణాలను కాపాడిన ఉపాధ్యాయుడు సురేష్‌ను గ్రామస్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

రాకపోకలకు

అంతరాయం కలిగించిన వారిపై కేసు నమోదు

నర్సాపూర్(జి), సెప్టెంబరు 9 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందర రాస్తారోకో చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మునిగెల హన్మండ్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం హెడ్ కానిస్టేబుల్ జలాలుద్దీన్ అన్వర్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో రాంపూర్ గ్రామానికి చెందిన చాలా మంది వ్యక్తులు పోలీసుస్టేషన్ లోపలికి వచ్చి మా గ్రామానికి చెందిన వ్యక్తులపై ఎందుకు కేసు నమోదు చేశారని వాగ్వాదం చేశారు. రాంపూర్ గ్రామస్తులు చెప్పినా వినకుండా పోలీసుస్టేషన్ నుంచి బయటకు వెళ్లి పోలీసుస్టేషన్ ముందర జాతీయ రహదారి 61 రోడ్డుపై ఇరువైపులా కూర్చొని ఆదివారం మధ్యాహ్నం 12:30 నుంచి 2:30 గంటల వరకు దాదాపు రెండు గంటలు రోడ్డుపై వెళ్తున్న ప్రజల రాకపోకలకు ఇబ్బంది, ఆటంకం కలిగించి రోడ్డు మీద వెళ్లకుండా న్యూసెన్స్ చేయగా, ప్రజలకు ఆటంకం కలిగించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన పెద్దోళ్ల దశరథ్, బొప్పారం సాయిరాం, సాయినాథ్, పంచగూడ నరేష్‌లపై 189, 191, 126, 223, 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 9 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ఉద్యమకారుల ఫోరమ్ చైర్మన్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రానికి చేరిన చైతన్య యాత్రలో భాగంగా సోమవారం ఆయన మాట్లాడుతూ... ఉద్యమకారులు ఉద్యమ సమయంలో అనేక కష్టనష్టాలు ఎదుర్కొన్నారన్నారు. తగు న్యాయం చేయాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం కమిటీ వేయాలన్నారు. ఈ నెల 27న సికింద్రాబాద్‌లో జరిగే ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు కృష్ణంరాజు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టే శేఖర్, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్, ప్రభాకర్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో

ప్రజాకవి కాళోజీ చేసిన కృషి మరువలేనిది

● నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్

నిర్మల్, సెప్టెంబరు 9 : తెలంగాణ ఉద్యమంలో ప్రజాకవి కాళోజి చేసిన కృషి మరువలేనిదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా కవి కాళోజీ నారాయణ రావు 110వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... తన రచనలు, సాహిత్యం ద్వారా తెలంగాణ ప్రజానీకానికి ఉద్యమ పాఠాలు నేర్పిన గొప్ప వ్యక్తి కాళోజి అని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, భారత స్వాతంత్ర్య ఉద్యమం, ఆనాటి నిజామ్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు చేశారని తెలిపారు. కాళోజి జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. దీనివల్ల మహనీయుల చరిత్రను నేటి తరా లకు అందించిన వారిమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో రాజేందర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి రాజేశ్వర్‌గౌడ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీఏవో అంజిప్రసాద్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ కిషోర్

ఘనంగా కాళోజీ జయంతి

తానూర్, సెప్టెంబరు 9 : మండలంలోని భోరిగాం గ్రామ ఉన్నత పాఠశాలలో సోమవారం కాళోజీ నారాయణరావు జయంతిని పురష్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు కే. శంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, భోజరాం, కే. నారాయణరెడ్డి, బి. కృష్ణవేణి, విఠల్, రవికుమార్‌లున్నారు.

ముధోల్‌లోని పాఠశాలలో తెలంగాణ తెలుగు భాష ఉత్సవాలు

ముధోల్, సెప్టెంబరు 9 : ముధోల్‌లోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు మీడియంలో సోమవారం కవి కాళోజీ నారాయణ రావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తెలుగు భాష ఉత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల తెలుగు భాష ఉపాధ్యాయురాలు నీరజను పాఠశాల తరఫున సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అంజుమ్, కొక్కుల గంగాధర్, షాహిదా, పర్వీన్, కవిత యాదవ్, విజయలక్ష్మి, శ్రీధర్, కవిత, ఉషాకిరణ్మయి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాంతీయ భాషకు ప్రాణం పోసిన కాళోజీ

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 9 : ప్రాంతీయ భాషకు ప్రాణం పోసిన ప్రజా కవి కాళోజి నారాయణ రావు అని తెలంగాణ రచయితల వేదిక కవులు కొనియాడారు. తెరవే అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు, పోలీసు భీమేష్, కుమ్మరి నాగారం, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన నిర్మల్ మున్సిపల్ చైర్మన్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 9 : ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ఘన నివాళులర్పించారు. పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

లక్ష్మణచాంద, సెప్టెంబరు 9 : కాళోజి నారాయణ రావు జయంతిని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోను, మల్లాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, డిప్యూటీ తహసీల్దార్ అజీజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పసుపుల భాగ్యవతి, ప్రధానోపాధ్యాయుడు నాగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ఖానాపూర్, సెప్టెంబరు 9 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహమ్మద్ అబ్దుల్ హమీద్ ప్రసంగించారు. అంతకు ముందు కాళోజీ నారాయణరావు ఫోటోకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు శ్రీదేవి, నాగరాజు పాల్గొన్నారు.


భోరిగాం పాఠశాలలో..


కాళోజీకి నివాళులర్పిస్తున్న తెరవే సభ్యులు


లక్ష్మణచాంద తహసీల్దార్ కార్యాలయంలో..


నివాళులర్పిస్తున్న నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధితులకు చేయూత

భైంసా, సెప్టెంబరు 9 :వివిధ కారణాలతో కార్పోరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చేయూతనిస్తామని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పెర్కొన్నారు. సోమవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలవాసులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రోసిడింగ్ కాపీలను అందచేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాట్లాడుతూ కార్పోరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందిన పేద,మధ్య తరగతి ప్రజానీకానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అండదండగా నిలుస్తామని తెలిపారు. ఇదే క్రమంలో నియోజక వర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో కుల సంఘాల భవనాల నిర్మాణాలపై దృష్టి సారించామని పెర్కొన్నారు. రోడ్ల నిర్మాణాలు, మరమ్మత్తుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పెర్కొన్నారు. ఇక్కడి ప్రాంత సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనులను జిల్లా ఇంచార్జీ మంత్రివర్యులు సీతక్క ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయా శాఖల మంత్రుల దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా పాటుపడుతున్నామని వెల్లడించారు. ఇందులో కుంటాల, భైంసా మండల, పట్టణ పరిధిలోని మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నాయి.

తెలుగు భాషా పండితుడికి ఘన సన్మానం


ఖానాపూర్, సెప్టెంబరు 9 : మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా పండితులుగా విధులు నిర్వహిస్తున్న వెన్నం అంజయ్యను సోమవారం ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలుగు భాష ఖ్యాతిని ప్రపంచానికి చాటిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా నిర్వహించే తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని తెలుగు భాషా పండితుడిని ఘనంగా సన్మానించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బోనగిరి నరేందర్ రావు, ఉపాధ్యాయులు తొంటి శంకర్, కుర్ర శేఖర్, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య తదితరులున్నారు.

వీడీసీ ఆధ్వర్యంలో పశువుల స్టాండ్ ఏర్పాటు

ఖానాపూర్, సెప్టెంబరు 9 : మండలంలోని తర్లపాడ్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పశువుల వైద్యం కోసం ఉపయోగించే స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాండ్ నిర్మాణం పూర్తి కావడంతో సోమవారం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోపు రత్నం ప్రారంభించారు. పశు సంపద అధికంగా కలిగిన గ్రామమైనందున పశువులకు అనారోగ్యం సోకితే వాటికి ఇంజక్షన్స్, సెలైన్ బాటిళ్లు ఎక్కించేందుకు వీలుగా ఈ స్టాండ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తనపల్లి జూనియర్ వెటర్నరీ అధికారి రమేష్, గ్రామస్తులు గాండ్ల శ్రీనివాస్, గోనెల నారాయణ, పెద్ది నర్సయ్య, బి. శ్రీనివాస్, సరీష్, నగేష్, భూమన్న, వెంటక రమణ, బోసు నర్సయ్య, రాజేశ్వర్, రాజమల్లు, తదితరులున్నారు.

కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థికి సన్మానం

ఖానాపూర్, సెప్టెంబరు 9 : కరాటే పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యా ర్థిని మచ్చ నాగచైతన్యను సోమవారం ఉపాధ్యాయుల బృందం సన్మానిం చా రు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2024 పోటీల్లో పథకం సాధించింది.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7 । కనిష్ఠం 24.4
నిర్మల్
జిల్లా వార్తలు

మంగళవారం 10 సెప్టెంబరు 2024

సాంకేతికత దిశగా.. విద్యుత్ సంస్థ





జిల్లా కేంద్రంలోని 33/11 కెవి సబ్‌స్టేషన్ ఇదే

- ఎన్‌పీడీసీఎల్‌లో కొత్త సంస్కరణలకు శ్రీకారం
- కరెంటు సరఫరా అంతరాయానికి ఇక చెక్
- సమస్యల పరిష్కారానికి కమాండ్ కంట్రోల్ సిస్టం
- విద్యుత్ స్తంభాలన్నింటికీ యూనిక్ నంబర్లు

నిర్మల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌పీడీసీఎల్ సంస్థ విద్యుత్ వినియోగదారులకు కరెంటు సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఆధునిక సాంకేతికత పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటూ సంస్థ పనితీరును మెరుగుపరుచుకోవడం అలాగే కోతలు లేకుండా వినియోగదారులకు కరెంటు సరఫరా చేయడం, బిల్లులు సక్రమంగా వసూలు చేయడం, తమకు అందే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవడం లాంటి వాటిపై విద్యుత్ శాఖ ఫోకస్ పెడుతోంది. దీని కోసం నిర్వహణ వ్యవహారం అంతా ఇక ఆన్‌లైన్‌లోనే చేపట్టేందుకు ఎన్‌పీడీసీఎల్ సంస్థ సిద్ధమైంది. ఇప్పటికే పలుయాప్‌లను అమలులోకి తెచ్చిన ఆ సంస్థ ఇక కమాండ్ కంట్రోల్ సిస్టంను ఏర్పాటు చేసి బిల్లింగ్, కలెక్షన్, ఇంటరప్షన్, కంప్లయింట్స్ లాంటి వివరాలన్నింటినీ ఒకే చోట అందుబాటులో ఉంచబోతోంది. కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడిందోనన్న విషయాన్ని అప్పటికప్పుడే తెలుసుకునేందుకు కూడా ఆ సంస్థ పలు చర్యలు చేపట్టింది. 33/11 కెవీ విద్యుత్ స్తంభాలకు యూనిక్ నెంబర్లను కేటాయించింది. ఈ పోల్‌నంబర్‌ల ద్వారా లోకేషన్ మ్యాపింగ్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌లు, లైన్‌లలో ఏర్పడే అంతరాయాలను గుర్తించనున్నారు. ఆర్టీసీ తరహాలోనే విద్యుత్ సరఫరా వ్యవస్థలో కూడా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అనేక కొత్త సంస్కరణలకు శ్రీకారంచుడుతోంది.

డిస్కం సమాచారం కోసం డాష్‌బోర్డు అప్లికేషన్

డిస్కంకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచేందు కోసం బోర్డు అప్లికేషన్‌ను ఈ సంస్థ తెరపైకి తెచ్చింది. దీని కారణంగా వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్, అవుటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం, డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్, కస్టమర్ పోర్టల్ సిటిజెన్ మేనేజ్‌మెంట్ సిస్టం, మీటర్ డాటా మేనేజ్‌మెంట్‌కు సంబందించి అంశాలన్నింటిని ఇటు సంబంధిత అధికారులు, సిబ్బంది అటు సాధారణ విద్యుత్ వినియోగదారులు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడబోతోంది. అలాగే కరెంటు సరఫరాలో జరుగుతున్న అంతరాయాలను లెక్కించేందుకు రెండు కొత్త ఇండెక్స్ సిస్టంలను అమలు చేయనున్నారు. సిస్టం యావరేజ్ ఇంటపర్షన్ డురేషన్ ఇండెక్స్ (సైదీ), అలాగే సిస్టం యావరేజ్ ఇంటరప్షన్ ఫ్రీక్వేన్సీ ఇండెక్స్ (సైఫీ)లతో విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాలను రోజువారీగా లెక్కించబోతున్నారు. దీంతో కరెంటు సరఫరాలో సగటుతో బాటు మొత్తం ఎన్నిసార్లు అంతరాయం జరిగిందనే విషయాలను తెలుసుకునేందుకు రియల్ టైం డాటా అందుబాటులోకి రానుంది. ఈ వివరాలన్నింటినీ ఏడాది పాటు అందుబాటులో కూడా ఉంచనున్నారు.




జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయం

చాట్‌బోట్‌లో సమాచారం

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ద్వారా కొనసాగుతున్న చాట్ బోట్‌లో ఎన్‌పీడీసీఎల్ సంస్థకు సంబందించిన పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచనున్నారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టంను అందుబాటులో ఉంచి కమాండ్ కంట్రోల్ సిస్టంలోని వివరాలన్నింటినీ తెలుసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. అలాగే అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్ అనే సిస్టం కూడా అమలు చేస్తున్నారు. 33/11 కెవి విద్యుత్ స్తంభాలకు యూనిక్ నంబర్‌లను కేటాయించి ఆ పోల్‌ల వారీగా వాటి నంబర్లతో లోకేషన్ మ్యాపింగ్ చేపడుతూ ట్రాన్స్‌పార్మర్లు, లైన్‌లలో ఏర్పడే అంతరాయాలను ఎప్పటికప్పుడు తొలగించనున్నారు.





విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

భోసి కర్ర వినాయకుని

దర్శనానికి భక్తుల తాకిడి



సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులు

తానూర్, సెప్టెంబరు 9 : మండలంలోని భోసి గ్రామంలోని మహాదేవుని ఆలయంలో ప్రతిష్ఠించిన కర్ర వినాయకుని దర్శనానికి తానూర్ మండలంతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి, జిల్లా నుంచి, మహారాష్ట్ర నాందేడ్, ధర్మాబాద్‌ల నుంచి భక్తుల తాకిడి పెరుగుతుంది. సోమవారం భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని కర్ర వినాయకున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రం తానూర్ నుంచి 20 మంది భక్తులు కాలినడకతో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నిర్వహించిన హారతి కార్యక్రమంలో వేళ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాహారతి కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం భైంసాకు చెందిన ఓం కళానిలయం గిరి యోగేష్, సాత్వికరెడ్డిల ఆధ్వర్యంలో రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు భుషి మురళి మాట్లాడుతూ.. భోసి కర్ర వరసిద్ధి వినాయకుని విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ కర్ర వినాయకున్ని 61సంవత్సరాలుగా ప్రతిష్ఠించి పూజిస్తున్నామని, తెలంగాణ రాష్ట్రంలోనే ఇలా నిర్వహిస్తున్న మొదటి గ్రామమని అన్నారు. కోరిన కోర్కెలు తీర్చి భక్తుల కొంగు బంగారంగా నిలుస్తున్నాడని తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మంచి నీటి సౌకర్యం, అన్నదానం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సోషల్ మీడియాకు విద్యార్థినులు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్స్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 9 : సోషల్ మీడియాకు విద్యార్థినులు దూరంగా ఉండాలని జిల్లా షీ టీమ్స్ ఇంచార్జి ఎస్సై పెర్సిస్ సూచించారు. సోమవారం రాంనగర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహిళల భద్రతకు పోలీసు శాఖ తొలి ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా కళాజాత బృందం ప్రదర్శనలు అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి

దస్తురాబాద్ రూరల్, సెప్టెంబరు 9 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏఈ కెశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం సమస్యల పరిష్కార వేదిక ఉంటుందన్నారు. ఇందులో సీజీఆర్ఎస్ చైర్మన్ నారాయణ, సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సభ్యత్వ సేకరణలో లక్ష్యాన్ని చేరుకోవాలి

- నిజామాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 9 : జిల్లాలో బీజేపీ సభ్యత్వ సేకరణ లక్ష్యాన్ని చేరుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా 10 కోట్ల సభ్యత్వం లక్ష్యంగా నమోదు జరగాలన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం గల పార్టీ బీజేపీ అన్నారు. జిల్లాలో రెండు లక్షల సభ్యత్వ లక్ష్యం చేరుకోవాలన్నారు. సభ్యత్వ సేకరణ సమయంలో ఇతర పార్టీలకు బీజేపీకి ఉన్న తేడా ప్రజలకు వివరించాలన్నారు. దేశ రక్షణ కొరకు పాటుపడే ఏకైక పార్టీ అని అన్నారు. ప్రధాని మోదీ 370 రద్దుకు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. సమావేశంలో నాయకులు అడ్లూరి శ్రీనివాస్, సత్యనారాయణ గౌడ్, అయ్యన్నగారి భూమయ్య, ఇతర జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ వీసీ అక్రమాలపై విద్యార్థి సంఘాల గురి

- విజిలెన్స్ ఎంక్వయిరీకి డిమాండ్

ముథోల్, సెప్టెంబరు 9 : బాసర ట్రిపుల్ ఐటీ ఇంచార్జి వీసీ వెంకట రమణ చేసిన అక్రమాలు, ఆగడాలపై విద్యార్థి సంఘాలు పోరుబాట పట్టనున్నాయి. బాసర ట్రిపుల్ ఐటీలో ఒకపక్క విద్యార్థులు నిత్యం సమస్యలు ఎదుర్కొంటుంటే అక్కడ పని చేస్తున్న ఇంచార్జి వీసీ వెంకట రమణ అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. వీసీపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేపట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ట్రిపుల్ ఐటీలో వీసీ చేసిన అక్రమాలు, ఆగడాలపై పూర్తి ఆధారాలను ముథోల్ నియోజకవర్గంకు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో సేకరించారు. త్వరలో ఇంచార్జి వీసీ వెంకట రమణ చేసిన అక్రమాలు, ఆగడాలపై హైదరాబాద్‌లో మీడియా సమావేశం ఆయా విద్యార్థి సంఘాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం. వీసీపై విజిలెన్స్ ఎంక్వయిరీతో పాటు ఏసీబీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. ట్రిపుల్ ఐటీ సమస్యలపై పోరాడటానికి విద్యార్థి సంఘాలు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించనున్నాయి. బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీ పరిరక్షణయే ధ్యేయంగా విద్యార్థి జేఏసీ పోరాటం చేస్తుందని సర్దార్ వినోద్ కుమార్ అన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఇచ్చిన భూములలో

అక్రమ లే అవుట్ వేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

- ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు కడ్తాల్ వాసి ఫిర్యాదు

నిర్మల్, సెప్టెంబరు 9 : సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో నిరుపేదలకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కేటాయించిన భూములలో అక్రమ లే అవుట్ వేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కడ్తాల్ గ్రామానికి చెందిన బి. రాజ నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1998లో అప్పటి ప్రభుత్వం నిరుపేద ల కోసం 208, 209, 210, 212 సర్వే నెంబర్లలో 70 ఎకరాల భూమిని కొనుగోలు చేసిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన ఈ భూమిని అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేసిందన్నారు. ఈ భూముల్లో నిరుపేదలు సుమారు 15 సంవత్సరాల పాటు వ్యవసాయం సాగించారన్నారు. అయితే ఈ నిరుపేదల భూములపై కన్నేసిన ఓ రియాల్టర్ వారి నుండి తక్కువ ధరకు ఆ భూములను కొనుగోలు చేసి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లే అవుట్లు వేసి విక్రయిస్తున్నాడన్నారు. సదరు అక్రమ లే అవుట్లపై ఇదివరకే తాము చాలా మంది అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అతనిపై చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని ఆ 70 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. స్వాధీనం చేసుకున్న సదరు భూమిని ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణం కోసం ఉపయోగించాలన్నారు.



ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కడ్తాల్ గ్రామస్థులు

గంగాపూర్ బ్రిడ్జిని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి

- త్వరలోనే నిర్మాణానికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో విస్తృత పర్యటన
- దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల పరిశీలన



కడెం మండలంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు



గంగాపూర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్, సెప్టెంబరు 9 : గత రెండేళ్ల క్రితం కూలిపోయిన గంగాపూర్ బ్రిడ్జిని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆరోపించారు. సోమవారం కడెం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలలో ఎమ్మెల్యే బొజ్జు పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను, కల్వర్టులను పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా గంగాపూర్ బ్రిడ్జిని సందర్శించిన ఎమ్మెల్యే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం బ్రిడ్జిని పట్టించుకోలేదన్నారు. రెండేళ్ల క్రితం బ్రిడ్జి కూలిపోయిన అప్పటి పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. త్వరలోనే గంగాపూర్ బ్రిడ్జి నిర్మాణానికి తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం గంగాపూర్, దుప్యతండా, రాణిగూడ, లక్ష్మీపూర్, దేవునిగూడెం, కొలాంగూడ, కొర్ర తండా, మొర్రిపేట, దత్తోజీపేట, చౌడు తండా, నాయకపుగూడెం, రాజంపేట, తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు.

ఆయా గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. పలువురికి ఆర్థిక సహా యం అందజేశారు. వరదల్లో దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్లను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేస్తామన్నారు. అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాన్ని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

- భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ

ముథోల్, సెప్టెంబరు 9 : శాంతియుత వాతావరణంలో పండుగలు, వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు జరుపుకోవాలని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. ముథోల్‌లో సోమవారం గణేష్ మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో జీఎం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హాజరై మాట్లాడారు. అన్ని కులాలు, మతాలు సమన్వయంతో పోలీసు అధికారుల నిబంధనలు ఉల్లంఘించకుండా నిమజ్జనోత్సవ వేడుకను జరుపుకోవాలని కోరారు. మండపం వద్ద విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలని అవసరమైతే సంబంధిత అధికారుల సహాయం తీసుకోవాలన్నారు. పండుగలో ఆనందం ఉండాలి కానీ దుఃఖాన్ని మిగల్చవద్దన్నారు. నిబంధనలకు ఎవరు విరుద్ధంగా ప్రవర్తించినా, అవాంచనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక శక్తులు, అల్లరి మూకలపై గట్టి నిఘా ఉంచుతామన్నారు. విగ్రహాలను తరలించడానికి ముందురోజు వాహనాలను, క్రేన్లను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. చిన్న పిల్లలు నిమజ్జన ఊరేగింపు వాహనాలకు దూరంగా ఉండాలని, నిమజ్జన ఘాట్‌ల దగ్గరకు నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చేవారు జాగ్రత్తలు పాటించాలని కోరారు. సంబంధిత అధికారులు విద్యుత్ తీగలు సరిచేయుట, రోడ్డుపై గుంతలు పూడ్చడం వంటి ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. విగ్రహాలు బయలు దేరేటప్పుడు కరెంటు తీగల వద్ద గణేష్ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయంలో ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా వ్యవహరించరాదని, హోరెత్తించే లౌడ్ స్పీకర్లు, డీజేలతో అధిక శబ్దాలతో కాకుండా సహకరించాలన్నారు. ప్రతీఒక్కరు శాంతియుత వాతావరణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేష్, ఎస్సై సాయి కిరణ్, తహసీల్దార్ శ్రీకాంత్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

లోకేశ్వరం, సెప్టెంబరు 9 : మతిస్థిమితం లేని మహిళ గత మూడు రోజుల క్రితం ఇంట్లో నుండి వెళ్లగా ఆమె మృత దేహం సోమవారం చెరువులో లభ్యమైంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన సుంకరి సాయవ్వ(45) గత కొద్ది నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. ఈ నెల 6న ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లగా కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. చివరకు లోకేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చివరకు సోమవారం పుస్పూర్ ప్రాంతంలో గల చెరువులో మృతదేహం లభ్యమైంది. ఆమె చెల్లెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

డిగ్రీ విద్యార్థుల రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపడుతున్న డిగ్రీ విద్యార్థులు

నిర్మల్, సెప్టెంబరు 9 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో అక్రమ కట్టడాలను తొలగించాలంటూ సోమవారం విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ... ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కబ్జా చేసి ఆక్రమణదారులు కొత్తగా నిర్మాణాలను చేపడుతున్నారని వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వచ్చేంత వరకు నిరసన కార్యక్రమం ఆపేది లేదన్నారు. వెంటనే కలెక్టర్ రావాలని, వచ్చి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. గంట పాటు ఖానాపూర్ వైపు, నిర్మల్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాకింగ్ అండ్ లాఫింగ్ అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో కళాశాల విద్యార్థులు, వాల సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో కురుస్తున్న వర్షాలు

నిర్మల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన కడెం, గడ్డెన్న వాగు ప్రాజెక్టులకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 1.768 టీఎంసీలుగా ఉంది. 1140 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ఒక వరద గేటు ఎత్తి దిగవనున్న శుద్ధ వాగులోకి నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 7.027 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 3,784 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది.

పీఆర్‌టీయూ మండల శాఖ కార్యవర్గం

ముథోల్, సెప్టెంబరు 9 : మండల పీఆర్‌టీయూ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్రబాబు, టీవీ రమణరావులు తెలిపారు. మండల పీఆర్‌టీయూ అధ్యక్షులుగా పి. ప్రవీణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎంఏ ఆహాద్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్. వసంత్‌రావు ఎన్నికైనట్లు తెలిపారు.